క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

క్రీడాకారులకు తైక్వాండో బెల్ట్ పరీక్షలు



బెల్ట్‌లను అందుకున్న క్రీడాకారులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞానకేంద్రంలో క్రీడాకారులకు సోమవారం బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. గ్రాండ్‌మాస్టర్ కేవీ.బాబురావు సారథ్యంలో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి నైపుణ్యత ఆధారంగా ప్రతిభా బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వేమన విజ్ఞానకేంద్రం ప్రతినిధులు టెంకాయల దామోదరం, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, రెడ్డెప్ప, మునిలక్ష్మి ముకేష్, తైక్వాండో శిక్షకుడు ఎ.బాలకృష్ణన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ



హాస్టల్‌లో వసతులను పరిశీలిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ

పాకాల : విద్యార్థులు అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానికంగా ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ బ్యాక్టీరియా, నీటి కలుషితం వల్ల అతిసార వ్యాధి సంక్రమిస్తుందని, వ్యాధి సోకిన వారికి వాంతులు, విరేచనాలు విపరీతంగా అవుతాయన్నారు. బీసీ వసతి గృహంలో తాగడానికి బోరు నీటిని వాడుతున్నట్లు గుర్తించిన డాక్టర్ తాగడానికి ఆర్వో వాటర్ ప్లాంట్ నీటిని తాగాలని సూచించారు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ అయ్యప్ప, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహస్వామికి అభిషేక పూజలు



శ్రీనరసింహ స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలోని అహోబిలం మఠంలోని శ్రీనరసింహస్వామికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకం హోమం, పూజలు నిర్వహించారు. ప్రతి నెల స్వామి నక్షత్రం రోజున స్వామివారికి హోమం, అభిషేకం, పూజలు నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

భక్తునికి నగదు అప్పగింత



భక్తునికి నగదు అప్పగిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ భక్తుడు పోగొట్టుకున్న బ్యాగు సహా వస్తువులను ఆలయ సిబ్బంది అతడికి అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా ఎర్రగట్టుపల్లెకు చెందిన పిట్టల శ్రీకాంత్ అనే భక్తుడు సోమవారం శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దర్శనార్థం ఆలయానికి వచ్చాడు. దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో తన బ్యాగ్‌ను పోగొట్టుకున్నాడు. గుర్తించి సిబ్బంది ఎస్‌పీఎఫ్ వారికి అందజేశారు. వారు మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా తెలపగా భక్తుడు రావడంతో అతనికి పోగొట్టుకున్న బ్యాగుతో పాటు అందులోని రూ.13 వేలు నగదును అందజేశారు.

యువతకు డ్రైవింగ్ లైసెన్సు

- రవాణాశాఖ కార్యాలయం వద్ద క్యూ కడుతున్న యువకులు
- వాహనాల తనిఖీల్లో భారీ జరిమానాలతో యువత, తల్లిదండ్రుల్లో మార్పు
- నిబంధనలు పాటించి..ప్రమాదాలను అరికట్టాలంటున్న రవాణాశాఖ అధికారులు



వాహనదారులకు డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించేందుకు రవాణాశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాక్

తిరుపతి మంగళం : నేటి తరానికి అనుగుణంగా రకరకాల మోడల్స్ యువతను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. పలు రకాల మోటార్ సైకిళ్లు మార్కెట్‌లో పోటీపడుతున్నాయి. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ముచ్చట కొద్దీ వాటిని కొనిస్తున్నారు. వాహనాలు కొన్న తర్వాత లైసెన్సు తీసుకోవాలి, రవాణా, పోలీస్ నిబంధనలు పాటించి వాహనాలు వాటిని బాధ్యత యువతపై ఉంది. అయితే యువత మోటార్ సైకిళ్లు కొనుగోలు చేయడంలో చూపుతున్న ఆసక్తి, లైసెన్సులు పొందే విషయంలో చూపడం లేదు. అలాగే రోడ్డు ప్రమాదాల్లోనే మరణిస్తున్న వారిలో యువకులే ఎక్కువగా ఉండడంతో రవాణాశాఖ, పోలీస్ అధికారులు దీనిపై దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఓ వైపు అవగాహన కల్పిస్తూనే, మరోవైపు వాహన తనిఖీల్లో జరిమానా విధిస్తుండడంతో యువత ఆలోచన ధోరణిలో మార్పు మొదలైంది. లైసెన్సులు తీసుకోవడంపై మొగ్గు చూపుతోంది. ఎల్ఎల్ఆర్ టెస్టులు పాస్ అవ్వడం, డ్రైవింగ్ ట్రాక్‌లో సునాయాసంగా వాహనాలు డ్రైవ్ చేస్తూ లైసెన్సులకు మార్గం సుగమం చేసుకుంటున్నారు. దీంతో తిరుపతి జిల్లాలోని మంగళం జిల్లా రవాణా కార్యాలయంతో పాటు శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు ప్రాంతాల్లోని రవాణా కార్యాలయాలు డ్రైవింగ్ లైసెన్సులు కోసం వచ్చే యువతతో కిటకిటలాడుతున్నాయి.

క్యూ కడుతున్న యువత

యువత ట్రెండ్ మార్చింది. వాహనం కొనుగోలు చేసిన వెంటనే ముందుగా డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలన్న ఆలోచనతో కొంతమంది నెట్ షాపుల్లో, సీఎస్‌సీ సెంటర్లలో లైసెన్సు కోసం స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. మరికొందరు నేరుగా తమ ఫోన్లలోనే స్లాట్ బుక్ చేసుకుని లైసెన్సు పొందేందుకు ఎల్ఎల్ఆర్ । టెస్టుకు వెళుతున్నారు. టెస్ట్ పాస్ అయిన తర్వాత ఆరు నెలల వరకు ఎల్ఎల్ఆర్ వినియోగించుకోవచ్చు. అయితే నెల వ్యవధిలోనే డ్రైవింగ్ లైసెన్సు పొందేందుకు తిరిగి డ్రైవింగ్ టెస్టుకు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి టెస్ట్‌లో పాస్ అయితే లైసెన్సు పొందవచ్చు. అయితే ఇదివరకు డ్రైవింగ్ లైసెన్సు పోస్టల్‌లో ఇంటి వద్దకే వచ్చేది. అయితే ప్రస్తుతం రవాణాశాఖ లైసెన్సు, ఆర్‌సి కార్డులను మంజూరు చేయడం లేదు. దాంతో లైసెన్సు కాపీని ఆన్‌లైన్‌లోనే తీసుకోవచ్చు. ఈ నేపథ్యంలో యువత డ్రైవింగ్ టెస్ట్‌లను సులువుగా పాస్ అవుతూ లైసెన్సులు పొందుతోంది.

రోడ్డు ప్రమాదాలు, వాహనాల తనిఖీలతోనే మార్పు

ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, రవాణా శాఖ, పోలీస్ శాఖల నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారికి తనిఖీల్లో విధిస్తున్న జరిమానాలతో అటు తల్లిదండ్రులు, ఇటు యువతలో మార్పు వచ్చిందని చెప్పవచ్చు. లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు జరిగితే తప్పు వాహనదారుడిదే అవుతుంది. దాంతో పాటు తనిఖీల్లో లైసెన్సు లేకుండా పట్టుబడితే రూ. వేలల్లో జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇన్ని సమస్యల కన్నా లైసెన్సు పొందితే ఏ సమస్యా ఉండదు కదా? అని యువతలో వారి తల్లిదండ్రుల్లో మార్పు మొదలైంది. దీంతో డ్రైవింగ్ లైసెన్సు తీసుకునేందుకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా యువత రవాణా కార్యాలయాల వద్ద క్యూలు కడుతోంది.



ఎల్ఎల్ఆర్ టెస్ట్ కోసం ఆర్టీఓ కార్యాలయం ఆవరణలో వేచి ఉన్న యువత



డ్రైవింగ్ టెస్ట్ కోసం ట్రాక్ వద్ద వేచి ఉన్న యువత, వాహనదారులు

నిబంధనలు పాటించి.. ప్రమాదాలను అరికట్టాలి

వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు విధిగా రవాణాశాఖ నిబంధనలు పాటించాలి. అప్పుడే రోడ్డు ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చు. ముఖ్యంగా ఉరకలేస్తున్న యువకులు 200 సీసీ, 250 సీసీ బైక్‌లను కొనుగోలు చేసి రోడ్లపై జుమ్మంటూ దూసుకుపోతుంటారు. నిబంధనలు పాటించకుండా చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా నిండు నూరేళ్ల జీవితం రోడ్డు ప్రమాదాలతో అంతం అవుతుంది. పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల దుఃఖమే మిగులుతుంది. దీనిని అందరూ దృష్టిలో ఉంచుకోవాలి. యువతతో పాటు ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించి..ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ఉంది.

- సుబ్రమణ్యం, ఇన్‌చార్జ్ జిల్లా రవాణాశాఖాధికారి

నైపుణ్యతతోనే ఉద్యోగాలు



మాట్లాడుతున్న డీవీఎస్ చక్రవర్తిరెడ్డి

తిరుపతి అర్బన్: శరవేగంగా మారుతున్న కాలాన్ని బట్టి చూస్తే చదువుతో పాటు నైపుణ్యత ఉంటేనే ఉద్యోగాలు అవకాశాలు వరిస్తాయని తిరుపతి న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్ ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అధినేత డీవీఎస్ చక్రవర్తి రెడ్డి వెల్లడించారు. సోమవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌డీహెచ్ఆర్ కళాశాలలో విద్యార్థులతో కలసి వరల్డ్ యూత్ స్కిల్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతో పాటు నైపుణ్యతపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు.

అనంతరం డీఆర్‌డీఏ పీడీ ప్రభావతిరెడ్డి మాట్లాడుతూ డీఆర్‌డీఏతో పాటు సీడాప్, న్యాక్ ద్వారా ఇస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణాంశాలను తెలియజేశారు. అంతేకాకుండా జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగులకు కల్పిస్తున్న ఉద్యోగాలను వెల్లడించారు. సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం పెద్దపెద్ద ఉద్యోగాలు పొందడానికి నైపుణ్యం తప్పనిసరి అన్నారు. అనంతరం రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్యామ్‌మోహన్ మాట్లాడుతూ ఓ వైపు స్కిల్‌ను ప్రోత్సహించడమే కాకుండా గత నాలుగేళ్లుగా జాబ్‌మేళా ద్వారా యువత పొందిన ఉద్యోగాల అవకాశాలను వివరించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ వరల్డ్ యూత్ స్కిల్ డేను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగులు మురళి, సునీల్, ఢిల్లీ, గణేష్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్పీతో పలువురు భేటీ



ఈఓ శ్యామలరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు



ఎస్పీ సుబ్బరాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి(అలిపిరి): స్థానిక టీటీడీ పరిపాలన భవనంలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావును తిరుపతి జిల్లా ఎస్పీగా సోమవారం బాధ్యతలు చేపట్టిన సుబ్బరాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీటీడీ శాంతిభద్రతలపై వారు చర్చించుకున్నారు.

బస్టాండ్‌లో భద్రత పెంచండి

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు భద్రతా సిబ్బందిని పెంచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) చెంగల్‌రెడ్డి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును కోరారు. సోమవారం ఆయన తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి రోజూ ప్రయాణికుల రాకపోకలను వివరించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల భద్రత దృష్ట్యా భద్రత పెంచాలని కోరారు. బస్టాండ్‌ను ఒకసారి పరిశీలించి అవసరమైన మేరకు సిబ్బంది ఏర్పాటు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. ఆర్టీసీ తిరుపతి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ రెడ్డి వారితోపాటు ఉన్నారు.

మంచి లక్షణాలు అలవర్చుకోవాలి

తిరుపతి మంగళం : విద్యార్థి దశలోనే మంచి లక్షణాలను అలవర్చుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు రెండవ దశలో నిర్మితమైన నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను రిక్రూట్ చేయాలని, మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్‌ను బాగు చేయాలని, పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేపట్టిన గదుల నిర్మాణం పూర్తి చేయించాలని, ఇస్కాన్ ద్వారా సరఫరా అవుతున్న ఆహారంలో నాణ్యత పెంచాలని హెచ్‌ఎం కేశవులు నాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై స్పందిస్తూ త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు సేకరించిన నగదును 2023–24లో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే నాని చేతుల మీదుగా నగదు పురస్కారం అందజేశారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఉపాధ్యాయుడు కృష్ణమనాయుడు రూ.10,116 చెక్కు రూపంలో ఎమ్మెల్యే పులివర్తి నానికి విరాళం అందించారు. కార్యక్రమంలో డీఈఓ శేఖర్, ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, నాడు–నేడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామచంద్ర రెడ్డి, ఎంపీడీఓ రమేష్, స్థానిక టీడీపీ నాయకులు గోపీనాథ్, ఈశ్వరయ్య, సురేష్, పెరుగు భాస్కర్ రెడ్డి, గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, మణి, మంగళం నాని, అశోక్, వినోద్ పాల్గొన్నారు.



నాడు-నేడు కింద నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

సిద్ధేశ్వర స్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో సిద్ధేశ్వర స్వామి

భాకరాపేట : తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో నిద్ర మేల్కొలిపి నిత్య కైంకర్యాలను సమర్పించారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలోని ఉపాలయాల్లోని వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామి, ఆంజనేయ స్వామి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.


వైభవంగా పూల కొప్పెర



ప్రత్యేక అలంకరణలో బాలగుర్రప్ప స్వామి

భాకరాపేట: బాల గుర్రప్ప స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూల కొప్పెర కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. సోమవారం తెల్లవారుజామున అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం బాల గుర్రప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పూల కొప్పెర కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ముగిసిన వారాహి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు

సత్యవేడు: వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, హోమం పూజలు నిర్వహించారు. ముందుగా వారాహి దేవికి సామూహిక సహస్ర నామార్చన చేశారు. అమ్మవారి పూజకు ఐదు ప్రమిదల్లో దీపాలు వెలిగించి, నైవేద్యంగా పానకం సమర్పించారు. ఈమెను ఆరాధిస్తే జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు తొలగిపోతాయని, శత్రుభయం ఉండదని, జ్ఞానం సిద్ధిస్తుందని ఇక్కడి ప్రజలు విశ్వసిస్తారు. సాయంత్రం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త రవికుమార్ దేవర్, పూజారులు మల్లికార్జున ప్రసాదాలు అందజేశారు.

సంక్షేమ నిధిని పునరుద్ధరించాలి



టీటీడీ పరిపాలనా భవనంలో సమావేశమైన టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల సంక్షేమ నిధి(వెల్ఫేర్ ఫండ్)ని పునరుద్ధరించాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ అన్నారు. సోమవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలో వెల్ఫేర్ కమిటీ, ఉద్యోగ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ పలు నిర్ణయాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. టీటీడీ ద్వారా వెల్ఫేర్ ఫండ్‌లోని లోటును మ్యాచింగ్ గ్రాంట్ రూపంలో చెల్లించి వెల్ఫేర్ ఫండ్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ ఫండ్ రికవరీ రూ.45 నుంచి రూ.200 వరకు పెంచి ఈ స్కీమ్‌ను కొనసాగించాలని కోరారు. చనిపోయిన, పదవీ విరమణ పొందిన వారికి దాదాపు మూడేళ్లుగా చెల్లింపులు నిలిపేశారని.. వారికి గతంలో చెల్లించిన విధంగా వెల్ఫేర్ ఫండ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు గోవిందరాజన్(డిప్యూటీ ఈఓ) ఆనందరాజు(డిప్యూటీ ఈఓ), ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ యాదవ్, కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి రేఖ, సభ్యులు వంకిపురం పవన్, అశోక్ కుమార్, విశ్వనాథ్, సారిక, బాబు, తేజేశ్వర్ రెడ్డి, ఈశ్వర్ నాయక్ , ఉద్యోగ సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్యం అమలు చేయండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం అమలు చేయాలని నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష సూచించారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు స్వీపింగ్, చెత్త సేకరణ, కాలువల శుభ్రత, బ్లీచింగ్ పిచికారీ వంటివి చేపట్టాలన్నారు. ప్రతి రోజూ వీటిని సచివాలయ సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని చెప్పారు.

అధికారులు జవాబుదారీగా ఉండాలి



సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ ఆరణి సంధ్య

తిరుపతి తుడా: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులే జవాబుదారీ అని తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో ఆమె ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు సరైన పరిష్కారం చూపించే బాధ్యత ఆయా శాఖాధికారులదే అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే మాత్రం శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణతేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం , వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్రరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అన్నదానం



ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రుయా ఆస్పత్రి వద్ద సుమారు 500 మందికిపైగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం బీసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు భగవంతుడి ఆశీస్సులతో వందేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, నాయకులు మధుఆచారి, బాబు గౌడ్, సుబ్రమణ్యం, జగదీష్, నాగేంద్ర, మహేష్, మురళి పాల్గొన్నారు.

- తిరుపతి కల్చరల్

ఇసుక కొరతతో భవన నిర్మాణరంగం కుదేలు

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో ఇసుక కొరతతో భవన నిర్మాణ రంగం కుదేలయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22, 23వ తేదీల్లో తిరుపతిలో జరిగే సీపీఐ సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక ఇస్తామని చెప్పారని.. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదన్నారు. ఇక విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. ప్రత్యేక హోదా, పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. జిల్లా పరిధిలోని పలు పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, తులసి, వైఎస్ మణిరాజన్, గోపి, శివకుమార్, మోహన్‌రెడ్డి, శ్రీను, మల్లికార్జున, లాజర్, రాజయ్య, మణి, చంద్రయ్య, హరి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

వానలో తడవకుండా..



తిరుపతి నగరంలో ఉదయం నుంచి ఎడతెరపు లేకుండా వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో నగరవాసులు వర్షంలో తడుస్తూనే పనులపై బయటకు వెళ్తున్నారు. మరికొందరు జర్కిన్లు ధరించి, గొడుగుల సాయంతో పనులకు పోతున్నారు. సోమవారం కూడా నగరంలో వర్షం జోరుగా కురుస్తుండగా అయితే నగర శివార్లలోని ఓ రోడ్డు పక్కన ఉన్న భారీ సిమెంటు పైపుల కింద వర్షంలో తడవకుండా తలదాచుకున్నారు. ఆ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి